క్లుప్తంగా

సీసీరోడ్డుకు శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కనిగిరి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడతామని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. మండలంలోని చల్లగిరిగిల్ల పంచాయతీలో రూ.5 లక్షల మండల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు బుధవారం ఎంపీపీ, జెడ్పీటీసీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కస్తూరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన చేస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ జె.స్వర్ణకుమార్, ఎంపీటీసీ అల్లు నర్సమ్మ, రమేష్‌రెడ్డి, ఆదిరెడ్డి, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు 'కాపునేస్తం, వాహన మిత్ర' చివరి తేదీ

సింగరాయకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు కాపునేస్తం, వాహనమిత్ర దరఖాస్తు గడువు గురువారంతో ముగుస్తుందని ఎంపీడీఓ షేక్ జమీఉల్లా తెలిపారు. కాపునేస్తం పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళలు ఆగస్టు 8వ తేదీ 1963 నుంచి జూలై 31వ తేదీ 1978 మధ్యలో జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. అర్హులైన వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

కందుకూరు: ఒంగోలు నగరంలో గిరిజన యువకుడిపై పాశవికంగా దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని గిరిజన జిల్లా సమాఖ్య జిల్లా నాయకులు దుర్గా ప్రసాద్ అన్నారు. స్థానిక సీపీఐ బుధవారం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యం వెలుగులోకి వచ్చిందని, పోలీసులు దీనిపై వెంటనే స్పందించి నిందితులందరినీ అరెస్టు చేయాలన్నారు. ఈ ఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, మరోసారి ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి మాలకొండయ్య, బి.సురేష్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి హుస్సేన్, ఎండ్లూరి వీరాంజనేయులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

హనుమంతునిపాడు: హనుమంతాపురం గ్రామ వార్డు సచివాలయం నుంచి పొదిలి మండలం బదిలీపై వెళ్లిన కార్యదర్శి జి.డేవిడ్, ఇంజినీర్ అసిస్టెంట్ శివనారాయణను బుధవారం ఘనంగా సన్మానించారు. సచివాలయంలో సర్పంచ్ సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన సన్మాన సభ నిర్వహించారు. సన్మాన సభలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తానిగుండాల తిరుపతరెడ్డి వారి సేవలను కొనియాడారు. మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, వెంకటకాశమ్మ, గ్రామ కన్వీనర్ వెంకటకాశయ్య, మాజీ సర్పంచ్ బాలగురవయ్య, కార్యదర్శి రమణయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గుడ్లూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి యువకుడు మృతి చెందినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. మంగళవారం సాయంత్రం మండలంలోని బసిరెడ్డిపాలెం గ్రామం వద్ద రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో దప్పళంపాడు గ్రామానికి చెందిన జడ అనీల్(20) అనే యువకుడికి తీవ్ర గాయాలు కాగా ఒంగోలు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాదరెడ్డి పేర్కొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

టంగుటూరు: మండలంలోని అనంతవరం పంచాయతీ పరిధిలోని తాళ్లపాలెం పొలాల్లో బుధవారం కోడిపందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు. మూడు కోడి పుంజులు, రూ.13,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.

ఎండీయూ వాహనాలతో పుస్తకాల పంపిణీ

ఉలవపాడు: ఎండీయూ వాహనాల ద్వారా సెమ్-2 పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంఈఓ-1 ప్రసాదరావు, ఎంఈఓ-2 రమణయ్య బుధవారం ప్రారంభించారు. ఎంఆర్సీ నుంచి అన్ని ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, హైస్కూళ్లకు పుస్తకాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. జూన్ నెలలో జగనన్న విద్యాకానుకతోపాటు పాఠ్య పుస్తకాలు అందించగా, ప్రస్తుతం రెండో సెమ్‌కు సంబంధించి రెండో విడత పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.



పుస్తకాల పంపిణీని ప్రారంభిస్తున్న ఎంఈఓలు

అర్హులంతా లబ్ధి పొందాలి

- ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్



లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

కనిగిరి రూరల్: ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగకూడదనే ఉన్నత లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. మండలంలోని బొమ్మిరెడ్డిపల్లిలో బుధవారం సర్పంచ్ లోకిరెడ్డి రమణమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న 28 సంక్షేమ పథకాలను ప్రతి ఇంట్లో జల్లెడ పట్టి అందిచాలని కోరారు. జగనన్న సురక్షలో 11రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తామన్నారు. సచివాలయ సిబ్బంది, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, వైస్ చైర్మన్ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు రహీం, ఎంపీడీఓ మల్లికార్జున, పార్టీ పట్టణ మండల అధ్యక్షుడు సానికొమ్ము రంగ నాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, లోకిరెడ్డి అంకిరెడ్డి, జిల్లా, రాష్ట్ర నాయకులు పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, శ్రీ హరిరెడ్డి, సచివాలయ అధికారులు, గృహ సారథులు, వలంటీర్లు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని చల్లగిరిగిల్ల పంచాయతీలో జరిగిన జగనన్న సురక్షలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, సర్పంచ్ జె.స్వర్ణ, ఎంపీటీసీ అల్లు నరసమమ్మ, తహసీల్దార్ యు పుల్లారావులు, ఏఓ ఫ్రాన్సిస్ బాబు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యదర్శి అరవిందా, స్థానిక నాయకులు రమేష్‌రెడ్డి, ఆదిరెడ్డి, వెంకట సుబ్బయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పామూరు: జగనన్న సురక్ష ద్వారా క్షేత్రస్థాయిలో సులభతరంగా దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్నామని ఎంపీపీ గంగసాని లక్ష్మి, తహసీల్దార్ ఆవుల సురేష్, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు అన్నారు. పామూరు మూడో సచివాలయం, మండలంలోని బోడవాడ సచివాలయాల పరిధిలో బుధవారం జగనన్న సురక్షలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, ఈఓఆర్డీ వి.బ్రహ్మానందరెడ్డి, కో ఆప్షన్ నాయబ్‌రసూల్, సర్పంచ్ రాగమ్మ, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు చాంద్‌బాషా, ఎంపీటీసీ షేక్.అబ్దుల్, రాఘవేంద్ర, గోవిందయ్య, ఖాదర్‌బాషా, సర్పంచ్‌లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

వెలిగండ్ల: సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తాతపూడి సుకుమార్, తహసీల్దార్ చిలకల నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని కొటాలపల్లి, మరపగుంట్ల గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలను ఎటువంటి ఫీజు లేకుండా ఉచితంగా అందజేస్తున్నామన్నారు. సర్పంచ్ ఎలికా నారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు రామన భాస్కర్‌రెడ్డి, కేలం అంకిరెడ్డి, వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పామూరులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



వెలిగండ్ల: లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీడీఓ



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

గడప గడపలో సంక్షేమ లబ్ధి

- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్

పామూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గడప గడపలో సంక్షేమ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. మండలంలోని దాదిరెడ్డిపల్లె సచివాలయం పరిధిలోని దాదిరెడ్డిపల్లె, బీసీకాలనీ, చట్టుమడుగు, ఎస్సీకాలనీల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు. గ్రామానికి చెందిన కొందరు ఇంటింటికీ కుళాయి నీరు పూర్తి చేసి ఇవ్వాలని కోరగా..ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని పనులు త్వరితగతిన పూర్తిచేసి సరఫరా చేస్తామని తెలిపారు. గ్రామస్తులు కొందరు తరుచూ విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా..నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్య తలెత్తకుండా చూడాలని విద్యుత్‌శాఖాధికారులకు సూచించారు. ప్రస్తుతం సచివాలయ పరిదిలో గడప గడపకు కార్యక్రమం పూర్తయిన వెంటనే సచివాలయానికి రు.20 లక్షల నిధులు మంజూరవుతాయని, ఆ నిధులతో ప్రాధాన్యతా క్రమంలో నీటి వసతి, సీసీరోడ్ల నిర్మాణం చేపట్టి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మండలంలోని దాదిరెడ్డిపల్లె సచివాలయ పరిదిలోని దాదిరెడ్డిపల్లె, చట్టుమడుగు గ్రామాలు, బీసీ, ఎస్సీకాలనీల్లో నిర్వహించిన గడప గడపకూ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

పార్టీ, కులం, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా చూడాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ ఎంపీపీ, సచివాలయ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగసాని లక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సర్పంచ్ బద్దిపూడి శారమ్మ, మలినేని శ్రీనివాసులు, మెడబలిమి గురవయ్య, ఎంపీటీసీ మెడబలిమి ఆదిలక్ష్మమ్మ, బ్రహ్మయ్య, రెక్కల అనితారెడ్డి, కోదూరి రామసుబ్బారెడ్డి, మిరియం రామారావు, బద్దిపూడి మార్కు, దేవనబోయిన సుబ్బయ్య, చల్లా సుబ్బారావు, సచివాలయ మండల కన్వీనర్ ఖాదర్‌బాషా, జొన్నలగడ్డ గోవిందయ్య, చల్లా నారాయణయాదవ్, చల్లా శివయ్య, సూరిపోగు మాల్యాద్రి, బద్దిపూడి జార్జ్, కుమ్మరికుంట శాంసన్, కాకర్ల వెంకట చక్రవర్తి, సోడిబోయిన సంజీవయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదలకు మేలు



జమ్ములపాలెంలో సర్టిఫికెట్ అందిస్తున్న ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: జగనన్న సురక్షతో అన్ని వర్గాలకూ మేలని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జమ్ములపాలెం, మల్లవరప్పాడు సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరికూటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలినాళ్లలో కరోనా విపత్తును సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారానే ఎదుర్కోగలిగామన్నారు. జమ్ములపాలెంలో 1050, మల్లవరప్పాడులో 570 మందికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవరావు, ఎంపీడీఓ రత్న జ్యోతి, డీటీ శ్రీనాథ్, ఈఓఆర్డీ నర్రా జగదీష్‌బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, సర్పంచి రావూరి స్నేహ, కాకుమాని కోటేశ్వరి, కార్యదర్శి అరుణకుమారి, మొలకలపల్లి సీతారామయ్య, వడ్డేవోలు పద్మావతి, పాటిబండ్ల కళాకర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సింగరాయకొండ మండలంలో 9,002 సర్టిఫికెట్లు జారీ

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 9,002 మందికి సర్టిఫికెట్లు జారీ చేసినట్లు ఎంపీడీఓ షేక్ జమీఉల్లా తెలిపారు. మండలంలో 23,288 గృహాలు ఉండగా సర్వేలో భాగంగా 10,792 దరఖాస్తులకు టోకెన్లు ఇచ్చామన్నారు. వారిలో 9,002 సర్టిఫికెట్లు జారీ చేసి, 181 దరఖాస్తులు తిరస్కరించామని, మరో 314 మందికి సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. మండలంలో అత్యధికంగా సింగరాయకొండ-4 సచివాలయం పరిధిలో 1,439, అత్యల్పంగా పాకలలో 192 సర్టిఫికెట్లు అందజేశామని వివరించారు.

గ్రామ సచివాలయాల వారీగా బింగినపల్లిలో 672, కలికవాయలో 708, కనుమళ్లలో 383, మూలగుంటపాడు-1 లో 361, మూలగుంటపాడు-2 లో 1,146, పాతసింగరాయకొండ లో 377, పాకల-1 లో 192, పాకల-2 లో 838, శానంపూడిలో 976, సింగరాయకొండ-1 లో 678, సింగరాయకొండ-2 లో 393, సింగరాయకొండ-3లో 299, సింగరాయకొండ-4లో 1,439, సోమరాజుపల్లిలో 312, ఊళ్లపాలెంలో 228 మందికి సర్టిఫికెట్లు అందజేశామని వెల్లడించారు. కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సహకరించిన గ్రామ వలంటీర్లు, మండల, గ్రామ స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదేళ్ల పాటు ఉపాధ్యయులుగా పని చేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన షేక్ గౌస్‌బాష, కె.ఆదిలక్ష్మలను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు జి.పెద్దిరాజు, ఎస్ రమణయ్య, హెచ్‌ఎం జీవీ సురేష్‌బాబు, అసిస్టెంట్ హెచ్‌ఎం బి.సుబ్బారావు మాట్లాడుతూ మంచి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులు జీవితాంతం గుర్తుపెట్టుకున్నారన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: మండలంలోని కొత్త ఏరువారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఐదుమంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తున్నారు. ఈమేరకు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను బుధవారం ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ దమ్ము వెంకటయ్య, విశ్రాంత ఎంఈఓ నాగిరెడ్డి, హెచ్‌ఎం ముంతాజ్ బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంపాడులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం

టీబీ నియంత్రణపై అవగాహన సదస్సు

వలేటివారిపాలెం: ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో జిల్లా ఉపవైద్యాధికారి ప్రియా వదన్ అధ్వర్యంలో టీబీ నియంత్రణ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యాక్రమంలో డాక్టర్ మణిదీపిక, సీహెచ్‌ఓ శివరామయ్య, టీబీ సూపర్‌వైజర్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నేతలు

పీసీపల్లి: పంట నష్టపోయిన రైతులకు బీమా నగదు విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి రైతులు బుధవారం స్థానిక వైఎస్సార్ రీడింగ్ రూములో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు అధైర్యపడకుండా ఉండేందుకు సీఎం జగన్ నష్టపరిహారం అందజేయడం ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొగ్గారెడ్డి, పోలు జయరామిరెడ్డి, ఓకేరెడ్డి, మేకల మాల్యాద్రి, శీలం సుదర్శనం, వెంగల్‌రెడ్డి, రైతు సంఘం యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, దేవండ్ల కృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరం

వలేటివారిపాలెం: మాదక ద్రవ్యాలు వాడకం ఆరోగ్యానికి హానికరమని ఎస్సై మహేంద్ర నాయక్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్సై మహేంద్రనాయక్ సంయుక్త అధ్యక్షతన మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం పట్టణాల నుంచి గ్రామాలకు పాకిందన్నారు. యువకులు వాటికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు వ్యసనాలకు లోనై ఆరోగ్యాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై మహేంద్రనాయక్

అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలి

టంగుటూరు: పొగాకు పంటను బోర్డు అనుమతించిన పరిమాణంలోనే సాగు చేయాలని రైతులకు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. ధరలు చూసి రైతులు అధిక ధరలకు బ్యారీన్లు, పొలాలు కౌలుకు తీసుకోవద్దని స్పష్టం చేశారు. కాగా స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం పొందూరు గ్రామ రైతులు 1041 బేళ్లను వేలానికి తీసుకురాగా 1002 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.245, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.232.38 పలికింది. వేలంలో 36 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి తెలిపారు.

టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

కందుకూరు: పేదల కోసం నిర్మిస్తున్న టిడ్కో గృహాలను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. స్థానిక సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు సమీపంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలను బుధవారం ఆయన పరిశీలించారు. మొత్తం 1408 గృహాలు ప్రస్తుతం నిర్మాణం పూర్తయిందని, పెండింగ్ పనులు పూర్తి చేసి రెండు వారాల్లో లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి సదుపాయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, ఎలక్ట్రిఫికేషన్, గ్రీనరీ వంటి పనులు వేగంగా చేయాలన్నారు. లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు ఇప్పించే ప్రక్రియను పూర్తి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా ఇళ్లను పేదలకు అప్పగించాలనే ఆలోచనతో ఉందన్నారు. అధికారులు, కాంట్రాక్టు సంస్థలు కలిసి వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. పేదలు నివసించే ఇళ్ల సముదాయంలో అన్ని రకాల సదుపాయాలు ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ చినకోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ మనోహర్, డీఈఈ బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

స్త్రీనిధి బకాయిలు వసూలు చేయాలి

కొండపి: మండలంలోని వివిధ గ్రామాల్లో డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన స్త్రీనిధి రుణాల వసూలును వేగవంతం చేయాలని వెలుగు డీపీఎం సనిత వీఓఏలకు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం వీఓఏలతో సమావేశం నిర్వహించారు. డీపీఎం మాట్లాడుతూ.. మండలంలో స్త్రీనిధి రికవరీ బాగుందన్నారు. 35 గ్రామ సంఘాలకు గాను 6 గ్రామ సంఘాల్లో మాత్రమే స్త్రీనిధి వసూలు మందకొడిగా ఉందని, ఆయా గ్రామాల్లో మహిళా సంఘాలకు అవగాహన కల్పించాలన్నారు. జీవనోపాధులకు సంబంధించి మండలానికి 50 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను గుర్తించాలని సూచించారు. ఆంధ్రా బ్యాంకు, స్టేట్‌బ్యాంకు అధికారులు మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళలకు తమ శాఖల నుంచి రుణాలు ఇస్తామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏరియా కోఆర్డినేటర్ రాంబాబు, ఏపీఎం రాజ్యలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెలుగు డీపీఎం సనిత

చెల్లెల్ని కొట్టాడని.. బావ హత్య

- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- టంగుటూరు మండలం కందులూరులో ఘటన



నిందితుడు గొల్లపూడి లాజర్(నాని)



మృతి చెందిన పసుమర్తి ఆశీర్వాదం

టంగుటూరు: చెల్లెల్ని కొట్టాడనే కోపంతో బావపై అతని బావమరిది కత్తితో దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన యువకుడిని స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచాడు. ఈ ఘటన టంగుటూరు మండలంలోని కందులూరు గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కందులూరు గ్రామానికి చెందిన పసుమర్తి ఆశ్వీర్వాదం (26) బేల్దారి మేస్త్రీ. ఇతనికి అఖిల అనే యువతితో వివాహం కాగా ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. వీరు హైదరాబాద్‌లో బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఆశ్వీర్వాదం, అఖిల మధ్య రెండు నెలల క్రితం గొడవ జరగడంతో కందులూరులోని అత్తారింటికి వచ్చింది. అఖిల అన్న గొల్లపూడి లాజర్(నాని)ది ఒంగోలు కాగా గత కొంత కాలంగా కందులూరులో నివాసం ఉంటున్నాడు. ఆశ్వీర్వాదం హైదరాబాద్ నుంచి రెండు రోజుల క్రితం కందులూరు వచ్చాడు. తన చెల్లెల్ని ఎందుకు కొట్టావని బుధవారం రాత్రి ఆశ్వీర్వాదంను లాజర్ నిలదీశాడు. ఇద్దరూ మద్యం మత్తులో ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో లాజర్ ఇంటి నుంచి తెచ్చుకున్న చాకుతో ఆశ్వీర్వాదాన్ని గుండెకు దగ్గరగా పొడిచాడు. గ్రామస్తులు వెంటనే స్పందించి ఆశీర్వాదాన్ని చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. లాజర్‌ను గ్రామస్తులు స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఖాదర్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నిందితుడిని టంగుటూరు పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పశు వైద్యశాల పునఃప్రారంభం

పామూరు: మండలంలోని రేగిచెట్లపల్లెలో వైద్యాధికారి లేక కొంత కాలంగా మూసి ఉన్న పశువైద్యశాలను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, లక్ష్మీనరసాపురం సర్పంచ్ మన్నేపల్లి విజయ్‌శేఖర్ బుధవారం పునఃప్రారంభించారు. పశుపోషకులు వైద్యశాల ద్వారా వచ్చే రాయితీ దాణా, గడ్డివిత్తనాలు పొందాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ తవ్వా మాలకొండారెడ్డి, మాల్యాద్రిరెడ్డి, పశుపోషకులు పాల్గొన్నారు.



పశువైద్యశాలను ప్రారంభిస్తున్న హుసేన్‌రెడ్డి, సర్పంచ్ విజయ్‌శేఖర్

100 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ

వలేటివారిపాలెం: రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు ఎల్‌ఆర్‌జీ 52 మినికిట్స్ కంది విత్తనాలు 100 శాతం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. మండలంలోని పోలినేనిచెరువులో సర్పంచ్ యాళ్ల రాజ్యలక్ష్మి, కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ అధికారి పి.అనసూయ అధ్వర్యంలో రైతులకు బుధవారం కంది విత్తనాలు పంపిణీ చేశారు.